Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 278 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :278 | బుధవారం 8 అక్టోబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

## పేద విద్యార్థికి వైద్య విద్య..

# ఇదే కూటమి సర్కార్ లక్ష్యం

- మంత్రి సత్యకుమార్
- కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదు
- గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు
- పాడేరులో మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయకపోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశాం
- గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం,**

గత ప్రభుత్వం అసమర్థ పాలన వలన మెడికల్ కళాశాలలకు ఈ దుస్థితి వచ్చిందని మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదని.. హాస్పిటల్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. పాడేరులో మెడికల్ - మిగతా 3లో






దివాళీకి ముందే

## పీఎం కిసాన్

- చివరిసారిగా 20వ విడత నిధులు.. ఆగస్ట్ 2న ప్రధాని నరేంద్ర మోదీ వారణాసి వేదికగా విడుదల
- ఇక 21వ విడత నిధులు నవంబర్- డిసెంబర్‌లో రావాల్సింది ఈసారి మాత్రం చాలా ముందుగానే రైతుల అకౌంట్లలో పడనున్నట్లు వార్తలు
- దీపావళి పండక్కి ముందే రైతులకు శుభవార్త అందించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది
- ఇటీవల భారీ వర్షాలు, వరదల ధాటికి ప్రభావితమైన పంజాబ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని సుమారు 27 లక్షల మంది రైతులకు 21వ విడత డబ్బులు ముందే అకౌంట్లో పడ్డాయి.

## మూడు పార్టీలనూ "లోకల్"

# ముంచేస్తుందా?

- స్థానిక సంస్థల ఎన్నికలకు పెద్దగా సమయం లేదు
- మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది.
- పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు విడతల వారీగా ఎన్నికలు జరగడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమయింది.
- 2026 జనవరి లేదా మార్చి నెలల్లోనే ఈ ఎన్నికలు ఉండే అవకాశముంది
- ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్న నేతల మధ్య విభేదాలు ఎన్నికల ఫలితాలను ఏ రకమైన ప్రభావానికి గురి చేస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది
- పైస్థాయిలో అగ్రనేతలు కలిసికట్టుగా ఉన్నా... కిందిస్థాయి నాయకల మధ్య సఖ్యత లేదు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు విడతల వారీగా ఎన్నికలు జరగడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమయింది. 2026 జనవరి లేదా మార్చి నెలల్లోనే ఈ ఎన్నికలు ఉండే అవకాశముంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజీ ఉంటుంది. అంగబలం, అర్థబలం సమృద్ధిగా ఉండటంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ ప్రాంతంలో కూడా గెలిస్తే మేలు జరుగుతుందని ప్రజలు సహజంగా భావిస్తారు. అందుకే లోకల్ బాడీ ఎన్నికల్లో ఎక్కువగా అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తూ ఉంటాయి.. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్న నేతల మధ్య విభేదాలు ఎన్నికల ఫలితాలను ఏ రకమైన ప్రభావానికి గురి చేస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, - మిగతా 3లో

## ప్రజల జీవితాలతో

# చెలగాటం



- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపుగా రెండేళ్లు కావొస్తోంది
- ఈ ప్రభుత్వం పట్ల ప్రజలకు భ్రమలు తొలగిపోయాయి
- "ఈ ప్రభుత్వం కళ్లార్పకుండా అబద్ధాలు చెప్తోంది
- జంకు లేకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తోంది
- వ్యవస్థలన్నీ నిర్వీర్యం, అరాచకం, అవినీతి కనిపిస్తున్నాయి
- సీఎం చంద్రబాబుకు పాలనపై ధ్యాస లేదు. పూర్తిగా పాలన గాడితప్పింది

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

చంద్రబాబు ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లాల అధ్యక్షులు, పార్లమెంటు పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపుగా రెండేళ్లు కావొస్తోందని.. - మిగతా 3లో



## మీరు సగం.. మేము సగం

- విజయానికి ఇది ఒప్పందం!
- ఎక్కువతక్కువలు లేకుండా భాజపా, జేడీయూ సమానంగా సీట్లు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.
- మొత్తం 243 స్థానాల్లో ఎన్డీయేలోని ఇతరపక్షాలకు కేటాయించగా మిగిలిన సీట్లను చెరిసగం పంచుకోవాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

## కల్తీ మద్యం నిందితుల్లో ఎంతటివారున్నా వదిలిపెట్టం

- మంత్రి కొల్లు రవీంద్ర
- రాష్ట్రంలో మద్యం మాఫియా తయారు చేసింది జగన్ కాదా?
- దక్షిణాఫ్రికాలో వైకాపా పెద్దలకు మద్యం వ్యాపారాలు లేవా?
- జగన్ సోదరుడు అవినాష్‌కు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి లేవా?



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం**

కల్తీ మద్యం నిందితుల్లో ఎంతటివారున్నా వదిలి పెట్టబోమని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. " రాష్ట్రంలో మద్యం మాఫియా తయారు చేసింది జగన్ కాదా? దక్షిణాఫ్రికాలో వైకాపా పెద్దలకు మద్యం వ్యాపారాలు లేవా? జగన్ సోదరుడు అవినాష్‌కు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి లేవా? రాష్ట్రంలో కల్తీ మద్యం వెనుక ఉన్న మూలాలు అన్నింటినీ బయటకు తీస్తున్నాం. ఎంతటి వాళ్లు ఉన్నా విడిచిపెట్టం, అవసరమైతే పీడీ - మిగతా 3లో




## ఐరాసలో పాక్ దురాగతలను ఎండగట్టిన భారత్

- ఆపరేషన్ సెర్చ్‌లైట్ సమయంలో పాకిస్తాన్ సైన్యం.. 4 లక్షల మంది మహిళలపై సామూహిక అత్యాచారాలు, సామూహిక నరమేధానికి పాల్పడింది
- 1971లో పాకిస్తాన్ చేసిన దురాగతాలను బయటపెట్టింది.
- జమ్మూ కాశ్మీర్‌పై పాకిస్తాన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఇప్పటికైనా ఆపాలని హితవు



## బీహార్‌లో కొత్త పొత్తు?

- చిరాగ్, పీకే జట్టు కడుతారా..?
- లోక్ జనశక్తి పార్టీ, జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం
- ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ జేడీయూ తో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు.
- మిగతా 43 స్థానాలను ఎల్‌జేపీ సహా చిన్నచిన్న పార్టీలకు ఇవ్వాలని ఆలోచిస్తున్నాయి.



## రూ.24,634 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

- నాలుగు మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని 18 జిల్లాలను అనుసంధానం చేసే ఈ నాలుగు ప్రాజెక్టులు ప్రస్తుత భారతీయ రైల్వే నెట్‌వర్క్‌ను సుమారు 894 కి.మీ. మేరకు విస్తరించనున్నాయి.

## గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి చిదంబరం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కలిగి ఉండాలి. అదేవిధంగా సంబంధిత సబ్జెక్టులో యూజీసీ నెట్, ఏపీసెట్ లేదా పీహెచ్‌డి కలిగి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను అక్టోబర్ 10వ తేదీ లోపు కళాశాల ఆఫీస్ నందు అందచేయవలెను. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా కళాశాల నందు కలిసి తెలుసుకోవచ్చునని సూచించారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

### ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
వాల్మీకి జయంతి పురస్కరించుకొని కుప్పం వాల్మీకి భవనం నందు అతి వైభవంగా వాల్మీకి జయంతి చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నమెంట్ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ, వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నం, టీటీడీడైరెక్టర్ శాంతారాం పట్టణ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కడ మెంబర్ రాజకుమార్, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ బాబు నాయుడు, ఇండస్ట్రియల్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ మున్సిపల్ చైర్మన్ సెల్వ రాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్ సురేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి వేటప్ప నాయుడు, కుప్పం వాల్మీకి పెద్ద గురువైన సురేష్ బాబు, వాల్మీకి కులస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కడా కార్యాలయంలో ఘనంగా

### గ్రామీణ మహిళా వ్యాపారవేత్తల మేళా - 2025 కార్యక్రమం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
కుప్పం కడా కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రభుత్వం గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కడా, గ్రామీణ మహిళా వ్యాపారవేత్తల మేళా వంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, మహిళలు స్వావలంబన దిశగా ముందుకు సాగేందుకు ఈ వేదిక ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, టీటీడీ బోర్డు మెంబర్ వైద్యం శాంతరం, జనసేన నాయకులు నరేష్, కుప్పం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, జనసేన, బిజెపి నాయకులు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
అన్నమయ్యజిల్లా పీలేరు వాల్మీకుల సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం నాయకులు గుండ్లూరు మురళి, రెడ్డప్ప, వెంకటరమణ, చంగల్ రాయులు, తదితరులు డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ ఆవరణంలో గుండ్లూరు మురళి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పక్కనే ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్దరణే ధ్యేయంగా పోరాటాలు చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత సుధాకర్ బాబు, గురు మోహన్, వారాది వెంకటరమణ. మురళిమఠంపల్లిశీనా. ప్రసాద్, సుబ్రహ్మణ్యం, బోయపల్లి మురళి. తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి,బీసీ, ఎస్సీ హాస్టల్లో ఆకస్మిక తనిఖీ

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**



శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, బిసి ఎస్సి వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అన్నం వండుతున్న కూరగాయలను పరిశీలించారు, పిల్లలకు అవసరమైన వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

# నేను అల్లా గుంట మొనగాడిని... ఎమ్మెల్యే డాక్టర్ థామస్

### నారాయణస్వామి దమ్ముంటే నన్ను టచ్ చెయ్ అంబేద్కర్ విగ్రహం పైన రాజకీయం చేయొద్దు...





**కార్వేటినగరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అనే నేను అల్లా గుంట గ్రామానికి చెందిన వాడిని మాలవాడు ఎస్సి ఆదిద్రావిడకు చెందిన వాడు అల్లా గుంట మొనగాడు అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు మంగళవారం కార్వేటినగరం మండలం వేణుగోపాలస్వామి ఆలయం నుంచి గాండ్ల మీట్ట కూడలి వరకు సూపర్ జీఎస్టీ అనే కార్యక్రమం టిడిపి నాయకులతో ట్రాక్టర్ ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నారాయణస్వామి నాపైన ఎన్నికల ముందు నేను క్రిస్టియన్ అని చెప్పారు నేనేమైనా విక్టోరియా మహారాణి కుమార్తెను వివాహం చేసుకున్నానా.. నేను ఏ ఊరు అని తెలియదా మా నాన్న ఎవరని నీకు తెలియదా మా అమ్మ ఎవరు అని నీకు తెలియదా. ఈ ఊర్లో పుట్టిన దళితుడిని మాలవాడిని ఎస్సీ ఆది ద్రావిడకు చెందిన వాడిని అల్లా గుంట మొనగాడిని మా ఊర్లో వచ్చి రాజకీయం చేస్తావా ఇక్కడ. అల్లా గుంట సింగం. నా కలర్ చూడు.. నీలాగా ఒకరోజు మా ఊరు పాది రి కుప్పమంటావు మళ్లీ డిఎం పురం అంటావ్ మళ్ళీ పుత్తూరు అంటావు మీ ఊరే నీకు తెలియనప్పుడు దాని గురించి నేనేం మాట్లాడాలో దమ్ముంటే రా నారాయణస్వామి.. తేల్చుకుందాం నువ్వు మగాడు అయితే రా డిబేట్‌కి అని నారాయణస్వామికి ప్రభుత్వం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సవాల్ విసిరారు ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ్మ నాయుడు ఎంపీడీవో చంద్రమౌళి బిజెపి ఇన్చార్జి రాజేంద్ర జనసేన ఇంచార్జ్ యుగంధర్ మండల పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయ యాదవ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ డైరెక్టర్ నాగేశ్వరరావు సహకార సంఘ అధ్యక్షుడు జనార్దన్ రాజు ఎమ్మెల్యే థామస్ సోదరుడు రాజా, యాదవ్ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ టిడిపి యువ నాయకుడు హరీష్ యాదవ్ సోక్రటీస్ స్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్, వెదురుకుప్పం మాజీ మండల అధ్యక్షుడు మోహన్ మురళి, మాజీ సర్పంచ్ కుప్పయ్య, తోటి మురళి గజేంద్ర నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ బిగల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు,

# అంగరంగ వైభవంగా శ్రీ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు.

### జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్న వందలాది మంది మహిళలు.





**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీసత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలోని శ్రీ వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు వెంకటరమణ ఆద్వర్యంలో మంగళవారం నాగరికత పరిరక్షణార్థం, మహిళామణులచే జ్యోతుల (దీపాలు) కార్యక్రమము చేపట్టారు. శ్రీపొట్టిశ్రీరాములు సర్కిల్ (చిన్నమార్కెట్) నుండి శ్రీవాల్మీకి సర్కిల్ మీదుగా శ్రీవాల్మీకి దేవాలయం వరకు అశేష భక్తజన సందోహముగా మంగళ వాయిద్యములతో మహిళామ తల్లులచే దీపారాధన. చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు సర్కిల్ (చిన్నమార్కెట్) నుండి శ్రీ వాల్మీకి సర్కిల్ మీదుగా శ్రీ వాల్మీకి దేవాలయం వరకు అశేష భక్తజన సందోహముగా మంగళ వాయిద్యములతో మహిళామ తల్లులచే దీపారాధన నిర్వహించారు. అంతేకాకుండా ఉత్సవ విగ్రహమునకు మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామాయణ మహా కావ్య సృష్టికర్త మహర్షి శ్రీ వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి కుల పెద్దలకు, వాల్మీకి సోదరీ సోదరీమణులకు శ్రీ వాల్మీకీ సేవా సంఘం గౌరవాధ్యక్షులు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కోశాధికారి ఆకుల సూర్య నారాయణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ లోకేష్, లీగల్ అడ్వైజర్ శివశంకర్, సమన్వయ కర్త టి.కే. బాబు, ఆనంద నాయక్, కార్యదర్శి నవీన్ కుమార్, గౌరవ సమన్వయకర్త వై.ఎల్. శ్రీనివాసులు కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. భక్తా దులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సలహాదారులు డాక్టర్ సురేంద్ర, పిఏ బాలాజీ, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, బేవిన హల్లి ఆనంద్ కుమార్,, వైఎస్ఆర్ ఇన్చార్జ్ దీపిక, కొండూరు వేణుగోపాల్ రెడ్డి హాజరై శ్రీ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిమళ, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, వాల్మీకి రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ బేవినహళ్ళి ఆనంద్, శ్రీ సప్తగిరి జ్యూవెలర్స్ యం.ఎన్. గోపి, హంస టెక్స్ టైల్ ఎన్. తిరుమలేష్ - బ్రదర్స్, శ్రీగంగాధర్ జ్యూవెలర్స్ సుజాత గంగా ధర్, ఖాద్రీ జ్యూవెలర్స్ బి.ఎన్. రాము, శ్రీ మారుతి ఫ్యాషన్స్ రఘునాథ్ శ్రీ వాల్మీకి జయంతి వేడుకలు విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న వాల్మీకి సోదర సోదరీమణులే కాక పెనుగొండ, మడకశిర, కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తాదులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రీ సర్వే మూడో విడత పారదర్శకంగా నిర్వహించాలి





### భూ సమస్యలు పరిష్కరించడంలో మండల సర్వేయర్, వీఆర్వో ప్రముఖ పాత్ర పోషించాలి

### ఈ 15 నెలల కాలంలో జిల్లాలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై సుమారు 63,063 వినతలు స్వీకరించడం జరిగింది

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 07:**
భూసమస్యలు పరిష్కరించడంలో మండల సర్వేయర్, వీఆర్వో ప్రముఖ పాత్రపోషించాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్లోని ప్రత్యేక సమావేశ మందిరంలో జిల్లాలో మూడో విడత రీ సర్వే కార్యక్రమాల అమలుపై ఆర్డీవోలతో,ఎమ్మార్వోలతో,మండల సర్వేయర్‌లతో, వీఆర్వోలతో, రీ సర్వే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డిఆర్ఓ మోహన్ కుమార్ తో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి రికార్డుల లో సవరణలు, పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు సహా భూమికి సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సమావేశాలలో వచ్చిన దరఖాస్తులతో పాటు, పెండింగ్‌లో ఉన్న అన్ని మ్యుటేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదే శించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వి ఆర్ ఓలు, విలేజ్ సెక్రెటరీల నుండి ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాల న్నారు. రీ



సర్వేలో భాగంగా కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూముల ను గుర్తించాలని, సివిల్ కేసులు ఉన్నట్లయితే కోర్టులను ఆశ్రయించేలా అర్జీదారులకు వివరించాల న్నారు. సమస్యల పరిష్కారానికి తహసిల్దార్లు విఆర్వోలతో కలసి క్షేత్రస్థాయి పర్యటన చేయాలని, ఫిర్యాదుదారునికి సమాచారం అందించి అందివ్వాలన్నారు. రీ సర్వే అందిన అర్జీలపై పది రోజుల్లోపు పరిష్కారం చేయాల న్నారు. ఈ విషయంలో ఆర్డీవోలు వారి పరిధిలో గల తాసిల్దార్లతో సమన్వయం చేసుకొని నిర్దేశిత గడువులోపల అర్జీలను పరిష్కరించాలన్నారు. తాహసిల్దార్లు ఎక్స్టెన్షన్ వేరియేషన్ బౌండరీ వేరియేషన్ జాయింట్ ఎల్పీఎం కరెక్షన్లకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వస్తాయని ఇందుకు సర్వే శాఖతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత పైలట్ ప్రాజెక్టు కింద 31 గ్రామాల లో 30,774 ఎకరాలు భూమిని సర్వే చేయడం జరిగిందని తెలిపారు. రెండో విడత రీసెర్వె కార్యక్రమం అమలులో భాగంగా నగిరి, చిత్తూరు, పలమనేరు నియోజకవర్గం వర్గాలలో 38 గ్రామాలు రి సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. సుమారు 40,359 ఎకరాల భూమిని రి సర్వే కార్యక్రమం నిర్వహించడం జరిగింద ని తెలిపారు. మూడో విడత రీ సర్వేకార్య క్రమాలలో భాగంగా మంగళ వారం రోజు ఈ కార్యక్రమం నిర్వహించుచున్నామని తెలిపారు. రేపటి నుండి 12 గ్రామాలలో 3,859 ఎకరాల భూమిని రీసెర్వె కార్యక్ర మం నిర్వహించు చున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం 31.3.26 నిర్వహించడం, జరుగుతుందని తెలిపారు. ఈ క్రింది గ్రామాలలో రీ సర్వే 3వ విడత నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.జాబితా చిత్తూరు డివిజన్ కు సంబంధించి శ్రీ రంగ రాజపురం మండలంలో రిపుంజయ రాజపురం(గ్రామం), గుడిపాల మండలంలో రాయిమాను పెట్టేడ (గ్రామం), తవనం పల్లి మండలంలో గోవింద్ రెడ్డి పల్లె (గ్రామం), గంగాధర నెల్లూరు మండలంలో ఆత్మకూరు (గ్రామం) నగరి డివిజన్‌కు సంబంధించి కార్వేటి నగరంలో ఏడువారి పల్లె(గ్రామం), నింద్ర మండలంలో కునమ రాజు పాలెం (గ్రామం), నగరి మండలంలో శ్రీనివాసపురం (గ్రామం) పలమనేరు డివిజన్‌కు సంబంధించి వీ.కోట మండలంలో పై పల్లె(గ్రామం), పెద్దపంజాణి మండలంలో ముత్తుకూరు(గ్రామం), బంగారుపాలెం మండలంలో మోతగుంట (గ్రామం) కుప్పం డివిజన్‌కు సంబంధించి శాంతిపురం మండలంలో చిల్లిమానిపల్లి(గ్రామం), గుడిపల్లి మండలంలో అంగన మాల్ కొత్తూరు (గ్రామం)లలో రి సర్వే నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే డిడి జయ రాజు, ఏడి ఇన్చార్జి పి ఎస్ శాంతిరాజ్, చిత్తూరు, నగిరి, పల మనేర్, ఆర్డీవోలు, మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మార్వోలు, మండల సర్వేలు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాలతో చెలగాటం

-మొదటిపేజీ తరువాయి

ఈ ప్రభుత్వం పట్ల ప్రజలకు భ్రమలు తొలగిపోయాయన్నారు. "ఈ ప్రభుత్వం కళ్లార్పకుండా అబద్ధాలు చెప్తోంది. జంకు లేకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తోంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యం, అరాచకం, అవినీతి కనిపిస్తున్నాయి. సీఎం చంద్రబాబుకు పాలనపై ధ్యాస లేదు. పూర్తిగా పాలన గాడితప్పింది. కేవలం సొంత ఆదాయాలు పెంచుకోవడం మీదే వీళ్ల ధ్యాస. విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయాలు తగ్గుతున్నాయి. చంద్రబాబు, ఆయన కుమారుడు, ఆయన బినామీలు.. వారి జేబుల్లోకి ఆదాయాలు వెళ్తున్నాయి. దోచుకో.. పంచుకో.. తినుకో.. కనిపిస్తోంది" అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. "అక్రమాలకు అవకాశం లేకుండా మన హయాంలో లిక్కర్ పాలసీ ఉండేది. క్వాలిటీ విషయంలో ఏరోజు కూడా రాజీ పడలేదు. లిక్కర్ కొనుగోలు ఎంపానెల్ డిస్టలరీస్ నుంచే కొనుగోలు. ప్రతికోటా క్రమం తప్పకుండా క్వాలిటీ చెక్ చేసేవాళ్లు. క్వాలిటీ చెక్ చేసిన తర్వాత మాత్రమే ప్రభుత్వ దుకాణాల్లోకి లిక్కర్. నిర్దిష్టమైన సమయాల్లోనే మాత్రమే లిక్కర్ అమ్మేవాళ్లం. షాపులు తగ్గించి, బెల్టుషాపులు ఎత్తివేశాం. లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే నిర్వహించింది. ఇల్లీగల్ పర్మిట్ రూమ్స్ రద్దు చేశాం. మూడింట ఒక వంతు షాపులు తగ్గించాం. మన హయాంలో ప్రతి బాటిల్‌పైన క్యూ ఆర్‌కోడ్ ఉండేది. ప్రతి బాటిల్ అమ్మేటప్పుడు క్యూ ఆర్‌కోడ్ స్కాన్ చేసి అమ్మేవాళ్లు. నూటికి నూరుశాతం క్వాలిటీతోనే మద్యం అమ్ముడుపోయేది. కాని, రాష్ట్రంలో ఇప్పుడు కల్తీ లిక్కర్ మాఫియా నడుస్తోంది. దీనికోసం ప్రభుత్వ దుకాణాలను మూసేశారు.. చంద్రబాబు, ఆయనకు సంబంధించిన మాఫియాకు ప్రైవేటు దుకాణాలు అప్పగించారు. వేలం పాట నిర్వహించి.. బెల్టుషాపులు వారి మనుషులకే అప్పగించారు. వీళ్లందరికీ మళ్లీ పోలీసుల నుంచి ప్రొటెక్షన్. ఎమ్మెల్యేకు ఇంత, పోలీసులకు ఇంత, పైనున్న పెదబాబుకు ఇంత, చినబాబుకు ఇంత అని పంచుకుంటున్నారు. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మొత్తం చేతుల్లోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఇప్పుడు ఇల్లీగల్‌గా ఆదాయాలు పెంచుకోవడానికి తెరలేపారు. వీరికి సంబంధించిన షాపుల నుంచి తమకు కావాల్సిన వారికి మాత్రమే ఆర్డర్లు ఇస్తున్నారు, ఇదోరకం మాఫియా.

చంద్రబాబు వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు: వైఎస్ జగన్

..ఇదికాక మరో రకం మాఫియా నడుపుతున్నారు. ప్రజలు



చనిపోయినా పర్వాలేదు, తమ జేబుల్లోకి డబ్బు వస్తే చాలనుకుంటున్నారు. చంద్రబాబు పరిపాలనలో రాక్షస పరిపాలన నడుస్తోంది. ఒక పద్ధతి ప్రకారం కల్తీ మద్యాన్ని పరిశ్రమ మాదిరిగా నడుపుతున్నారు. క్వాలిటీ లేని లిక్కర్‌ను తయారుచేసి, తన ప్రైవేటు మాఫియా నెట్‌వర్క్‌ద్వారా నేరుగా పంపిస్తున్నారు. ప్రతి నాలుగైదు బాటిళ్లలో ఒక బాటిల్ కల్తీ బాటిల్. ఆ కల్తీ మద్యాన్ని తాగి మనుషులు చనిపోతున్న పరిస్థితి. ప్రాంతాల వారీగా కల్తీ దందా నడుపుతున్నారు. కల్తీ మద్యం తాగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇబ్రహీపట్నంలో భారీగా దొరికిన మద్యం, దాని తయారీకి సంబంధించిన వస్తువులు మాఫియా తీవ్రతను తెలియజేస్తున్నాయి. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతూ లూటీ చేస్తున్నారు

..ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షలమంది విద్యార్థులు తగ్గిపోయారు. మన హయాంలో నో వేకెన్సీ బోర్డులు చూశాం. ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కడం చూస్తున్నాం. మన హయాంలో ఐదేళ్లలో ఎప్పుడూ అలాంటివి లేవు. ఎరువుల పంపిణీలో కూడా స్కాం చేశారు. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా చేస్తున్నారు. మనం కొత్తగా పెట్టిన కాలేజీలను ఇప్పుడు తన బినామీలకు, తన మనుషులకు తెగనమ్ముతున్నాడు. ..మనం వచ్చేంతవరకూ రాష్ట్రంలో ఉన్నవి 12 గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు మాత్రమే. మనం ఒక విజన్‌ను ఆవిష్కరించాం. ప్రతి జిల్లాల్లో గవర్నమెంటు కాలేజీ ఉండాలన్న సంకల్పంతో 17 మెడికల్ కాలేజీలు పెట్టాం. ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు ఎందుకు నడుపుతుంది?. అలా చేయకపోతే ప్రైవేటు వాళ్లు ప్రజలను దోచుకుంటారు. ఇవి నడపకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా చెప్పాలి. మనం ఉన్నప్పుడే 2023-24లోనే కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. మరో రెండు కాలేజీలు క్లాసులకు అందుబాటులోకి తెచ్చాం. తద్వారా 800 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. పులివెందులోల 50 సీట్లు %చీవీజ% ఇస్తే.. వద్దని చంద్రబాబు లెటర్ రాశాడు. మన హయాంలోనే అవసరమైన నిధులకు ఫైనాన్సియల్ టై అప్ చేశాం. అమరావతికి 50వేల ఎకరాలు సరిపోవని, మరో 50వేల ఎకరాలు సేకరిస్తున్నాడు.

..మొదటి 50 వేల ఎకరాలకే మౌలిక సదుపాయాలకోసం రూ.1లక్ష కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు చెప్పాడు. ఇప్పుడు కేవలం మౌలిక సదుపాయాలకే 2 లక్షల కోట్లు అవుతుందని చెప్తున్నారు. అలాంటి లక్షలమందికి, కోట్ల మందికి వైద్యం అందించి, చిరస్థాయిగా నిలబడే ఆస్తులైన మెడికల్ కాలేజీలను అప్పనంగా అమ్మేస్తున్నారు?. ఐదేళ్లలో రూ.5వేల కోట్లు పెట్టలేరా?. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

..అక్టోబరు 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శిస్తాను. అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం. మెడికల్ కాలేజీల ప్రైవటీకరణపై కరపత్రాలు పంపిణీ. కోటి సంతకాలను రచ్చబండ కార్యక్రమాల ద్వారా సేకరణ. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాల సేకరణ చేస్తాం. ప్రతి నియోజకవర్గ సమన్వయ కర్త ప్రతిరోజూ రెండు గ్రామాల సందర్శన. అలాగే నియోజకవర్గాల్లో రౌండ్ టేబుల్స్ ద్వారా చైతన్యపరిచే కార్యక్రమాలు. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తాం. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాల సమర్పణ. జిల్లా కేంద్రాల్లో నవంబర్ 12న ర్యాలీలు. ఒక జిల్లాలో నేనుకూడా పాల్గొంటాను. నవంబర్ 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి. నవంబర్ 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్‌కు అప్పగించే కార్యక్రమం తదుపరి జరుగుతుంది' అని వైఎస్ జగన్ వివరించారు.

# నేను దేవుడ్ని...
# అమ్మను దేవుడి దగ్గరకు పంపించా...

**కడప :** వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తల్లిని చంపిన యశ్వంత్ రెడ్డి మానసిక పరిస్థితిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. యశ్వంత్ రెడ్డి మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పోలీసుల విచారణలో కూడా తాను దేవుడిని అని.. ఆ విషయం అమ్మ నమ్మకపోవటంతోనే తల్లిని దేవుడి వద్దకు పంపించానంటూ యశ్వంత్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అల్లారుముద్దుగా పెంచిన కొడుకే తన పాలిట కాలయముడు అవుతాడని ఊహించలేకపోయిన ఆ కన్నతల్లి ఉదంతం ఇప్పుడు సంచలనంగా మారింది.వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో తల్లిని చంపిన తనయుడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. యశ్వంత్ కుమార్ రెడ్డి మానసిక స్థితి సరిగా లేదని వార్తలు వస్తున్నాయి. అయితే తాను దేవుణ్ని అంటే నమ్మలేదనే తల్లిని చంపినట్లు యశ్వంత్ కుమార్ రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రొద్దుటూరులోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన విజయ భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక సంతానం యశ్వంత్ కుమార్ రెడ్డి. లక్ష్మీదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఒక్కడే కొడుకు కావటంలో యశ్వంత్ కుమార్ రెడ్డిని గారాబంగా పెంచారు ఆ దంపతులు. కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతో చెన్నైలో ఇంజినీరింగ్ చదివించారు. ఇంజనీరింగ్ పూర్తి కాగానే యశ్వంత్ కుమార్ రెడ్డి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా హైదరాబాద్‌కు పంపించారు. ప్రతి నెలా ఖర్చుల కోసం డబ్బులు పంపించేవారు.ఈ క్రమంలోనే ఈ మధ్యనే ఒకసారి మూడు వేలు పంపించగా.. కొన్ని రోజులకే మరో పదివేలు కావాలని యశ్వంత్ రెడ్డి అడగటంతో తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో తల్లి మీద కోపం పెంచుకున్న యశ్వంత్ రెడ్డి.. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు చేరుకుని తల్లితో గొడవ పడ్డాడు. తండ్రిని గదిలో బంధించి తల్లి గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. కూరగాయలు కోసే కత్తితో కన్నతల్లి గొంతుకోసిన యశ్వంత్ రెడ్డి.. ఆ తర్వాత లక్ష్మీదేవి వరండాలోకి ఈడ్చుకుని వచ్చి పడేశాడు. ఆ తర్వాత తలుపులు బిగించుకుని టీవీలో పాటలు వింటూ కూర్చున్నాడు.మరోవైపు ఉద్యోగ ప్రయత్నాల కోసం హైదరాబాద్ చేరిన యశ్వంత్ రెడ్డి.. ఇన్నేళ్లు హైదరాబాద్‌లో ఒక్కడే రూమ్‌లో ఉంటున్నట్లు బంధువులు చెప్తున్నారు. ప్రతినెలా యశ్వంత్ ఖర్చుల కోసం ఇంటి నుంచి డబ్బులు పంపేవారని చెప్తున్నారు. అయితే యశ్వంత్ మానసిక స్థితిలో మార్పును గమనించిన అతని తల్లిదండ్రులు.. ఇంటికి వచ్చేయాలని కోరినా అతను వినిపించుకోలేదంటున్నారు. కేవలం డబ్బుల కోసం మాత్రమే యశ్వంత్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసేవాడని తెలిసిందిమరోవైపు హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రొద్దుటూరులోని ఇంటికి చేరుకున్న యశ్వంత్ రెడ్డి.. వచ్చిన వెంటనే తల్లితో గొడవ పడినట్లు తెలిసింది. తాను దేవుణ్ని అని.. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వాలంటూ లక్ష్మీదేవితో గొడవపడినట్లు సమాచారం. పోలీసుల విచారణలోనూ యశ్వంత్ రెడ్డి ఇదే విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. తాను దేవుడిని అంటే తల్లి నమ్మడం లేదని.. అందుకే దేవుడి వద్దకు పంపించానని యశ్వంత్ చెప్పినట్లు సమాచారంఈ క్రమంలోనే యశ్వంత్ రెడ్డి మానసిక స్థితిగతులపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో అతను ఉన్న పరిస్థితులు.. గతంలో మానసిక సమస్యలతో ఎప్పుడైనా ఇబ్బందులు పడ్డారా అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా ఒక్కగానొక్క కొడుకు అంటూ గారాబంగా పెంచిన కన్నతల్లినే.. ఓ కొడుకు అమానుషంగా గొంతుకోసి హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

# ఉత్తరాంధ్రపై జగన్ గురి

**విశాఖపట్టణం :** ఉత్తరాంధ్ర పై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టారా? పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టారా? వచ్చే ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారా? అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఇప్పుడే వ్యూహం రూపొందిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2029 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఎక్కువ సీట్లు తెచ్చుకుంటేనే వైసీపీకి ఛాన్స్ ఉంటుంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు ఎన్నికలను ఎదుర్కొంది. అందులో రెండింట దారుణ పరాజయం చవిచూసింది. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం.. ఉత్తరాంధ్రలో ఆరు సీట్లను గెలుచుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది ఉత్తరాంధ్రలో. అందుకే మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఉత్తరాంధ్రలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాయలసీమ అండదండగా నిలుస్తూ వస్తోంది. అక్కడ 70కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2014లో వైసీపీకి అక్కడ మెజారిటీ వచ్చింది. 2019లో స్వీప్ చేసింది. 2024లో మాత్రం ఓ ఏడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. అందుకే వచ్చే ఎన్నికల్లో రాయలసీమలో మెజారిటీ సీట్లు దక్కించుకొని.. ఉత్తరాంధ్రలో మెరుగైన స్థానాలు పొందితే..



మ్యాజిక్ ఫిగర్ దాటవచ్చు అన్నది జగన్మోహన్ రెడ్డి అంచనా. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఉత్తరాంధ్రలో వచ్చే స్థానాలను అనుసరించి మాత్రమే వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. అందుకే మూడున్నర ఏళ్ల ముందే ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. అందుకే సీనియర్లను యాక్టివ్ చేస్తున్నారు.ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అందులో ఓ 20 స్థానాలపై గురిపెట్టినట్లు సమాచారం. ఉత్తరాంధ్రలో సీనియర్లుగా బొత్స సత్యనారాయణ,ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణ దాసు వంటి సీనియర్లు ఉన్నారు. వారితోనే ఈసారి రాజకీయం చేసి ఉత్తరాంధ్రను దక్కించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటు పరాన్ని నిరసిస్తూ నర్సీపట్నంలో ఆందోళన చేయనున్నారు. మొత్తం ఉత్తరాంధ్రను ఆకట్టుకునేలా భారీ ప్లాన్ రూపొందించారు. విశాఖలో భారీగా పరిశ్రమల ఏర్పాటు జరుగుతోంది. పెట్టుబడులు కూడా వస్తున్నాయి. అది కచ్చితంగా కూటమికి ప్లస్ అవుతుంది. అందుకే ఈ పరిశ్రమల ఏర్పాటుకు జరుగుతున్న భూ సమీకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపులో జరుగుతున్న లోపాలపై పోరాటం చేయాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. తద్వారా కూటమి దూకుడుకు కళ్లెం వేయడంతో పాటు పార్టీని కొంతవరకు నిలబెట్టవచ్చని భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు మరి ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## కల్తీ మద్యం నిందితుల్లో ఎంతటివారున్నా వదిలిపెట్టం

-మొదటిపేజీ తరువాయి

యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం. కల్తీ మద్యం తయారీని గుర్తించింది ఎక్సైజ్ అధికారులే. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం కాబట్టే కల్తీ మద్యాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకున్నాం. మా పార్టీ వాళ్లు ఇద్దరు ఉన్నారని తెలిసిన వెంటనే.. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయించాం. వారు ఎన్నికల ముందు మాత్రమే మా పార్టీలోకి వచ్చారు. కల్తీ మద్యంపై శాఖాపరంగా సమగ్ర విచారణ జరుగుతోంది. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని కొల్లు రవీంద్ర అన్నారు.

## పేద విద్యార్థికి వైద్య విద్య.. ఇదే కూటమి సర్కార్ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయకపోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన ప్రాంతాలను విస్మరించిందని.. గిరిజన విశ్వవిద్యాలయం రాకుండా అడ్డుకున్నాని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయని వ్యాఖ్యలు చేశారు. పీపీపీకి ప్రైవేటైజేషన్‌కు తేడా తెలియకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వైద్య కళాశాలలో నిర్మించి ఉంటే ఇప్పుడు ఈ సమస్య ఉండేది కాదన్నారు. వైద్య విద్యను రాష్ట్రంలో పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని స్పష్టం చేశారు. గతంలో తాము చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందని వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారుని వ్యాఖ్యలు చేశారు.వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చితే.. తాము ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాలలలో కనీసం నిర్వహణ పనులు గత ప్రభుత్వం చేయలేదన్నారు. 'జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాలల పరిశీలనకు వస్తే అదే సమయంలో నేను వస్తాను. మెడికల్ కళాశాలల పరిస్థితిని జగన్‌మోహన్ రెడ్డికి వివరిస్తాను. జగన్ ప్యాలెస్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేసే వరకు లోపలికి వెళ్లారా. నర్సీపట్నం మెడికల్ కళాశాల పరిశీలనకు వస్తున్న జగన్ పార్వతీపురంలో నిర్మించిన మెడికల్ కళాశాల చూసి అక్కడ పరిస్థితిని వివరించాలి. జగన్ ప్రజలను అసత్యాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ కు గుణపాఠం చెప్పిన మార్పు రావడం లేదు. జగన్ ఆత్మ పరిశీలన చేసుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకునిలా వ్యవహరించాలి. జగన్‌కు అసెంబ్లీకి రమ్మని సవాల్ విసిరినా రాలేదు' అంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు.

## మూడు పార్టీలనూ "లోకల్" ముంచేస్తుందా?

-మొదటిపేజీ తరువాయి

జనసేన నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ అగ్రనేతలు మాత్రం కలసికట్టుగానే ఉన్నారు. కానీ నేతల మధ్యనే సఖ్యత లేదు. అది వాస్తవం. ఏ పార్టీ నియోజకవర్గంలో అధికారంలో ఉంటే మిగిలిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు వ్యతిరేకిస్తున్నారు. నామినేటెడ్ పదవులు తమకు దక్కకపోవడంతో పాటు పనుల కేటాయింపులో కూడా తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న అసహనం, అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తుంది. మద్యం షాపులు, ఇసుక, కాంట్రాక్టు పనులు వంటి విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు.? అసంతృప్తి.. అసహనం... కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మరొకవైపు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తున్నారు. కానీ నేతల మధ్య సమన్వయం లేమి కూటమి కొంపముంచుతుందేమోనన్న ఆందోళన ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకు పిఠాపురం నియోజకవర్గమే తీసుకుంటే అక్కడ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే అక్కడ జనసేనలోనే రెండు నుంచి మూడు గ్రూపులున్నాయి. ఇక టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య పొసగడం లేదు. ఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. లోకల్ ఎన్నికల్లో దెబ్బతీసి ఎమ్మెల్యేను అధినాయకత్వం ముందు దోషిగా నిలబెట్టాలన్న ప్రయత్నం జరుగుతున్నట్లు కనిపిస్తుందంటున్నారు. అదే జరిగితే కూటమిలోని మూడు పార్టీలకూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్నుపోట్లు తప్పవని కూటమి పార్టీ నేతలే అంటుండటం విశేషం. అయితే మరో మూడు నాలుగు నెలల సమయం ఉండటంతో అప్పటికి పరిస్థితి చక్కబడే అవకాశాలున్నాయన్న ఆశలు మాత్రం నేతల్లో కనిపిస్తుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## ఏపీలో 'స్క్రబ్‌టైఫస్' కే కలకలం

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' కేసులు కలకలం రేపుతున్నాయి. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం అధికం. జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలుంటాయి.




చికిత్స ఆలస్యమైతే మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీసి ప్రాణాంతకం కావచ్చు. నెల్లూరు జిల్లాలో నాలుగు కేసులు నమోదయ్యాయి. పరిసరాల శుభ్రత, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కేసులు నమోదయ్యాయి.. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం కుడితే ఈ స్క్రబ్‌టైఫస్ బారినపడతారు. ఇది ఇళ్లలో పెద్దవాళ్లు, పిల్లలను కుడుతుంది.. కాకపోతే ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు స్క్రబ్ టైఫస్ టెన్షన్ మొదలైంది. కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ కీటకాలు ఇప్పుడు అన్ని చోట్లకూ వ్యాపించాయంటున్నారుఒక కీటకం కుడితే నల్ల మచ్చ వస్తుంది. ఏడు రోజుల పాటు జ్వరం ఉంటుంది. డెంగీ లాగే కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌కు దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. లక్షణాలను బట్టి యాంటీ బయోటిక్స్‌తో నయం చేయవచ్చు. కొన్నిసార్లు ఐసీయూ చికిత్స కూడా అవసరం అవుతుందని చెబుతున్నారు వైద్యులు.తాజాగా నెల్లూరు జిల్లాలో స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదయ్యాయి. కావలి, వెంకటేశ్వరపురం, మనుబోలు, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ ఏడాది 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా స్క్రబ్ టైఫస్ బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా ఆ చుట్టుపక్కల వారికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? అని టెస్ట్‌లు చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా స్క్రబ్ టైఫస్ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి జీజీహెచ్‌కు పంపుతున్నారు. ఈ టైఫస్ జ్వరం నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేయాలని సూచిస్తున్నారు డాక్టర్లు.ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ ఇంట్లో పాత దిండ్లు, పరుపులు, మంచాలు, పరుపులు వంటివి తీసివేయడం మంచిదంటున్నారు. ఈ కీటకాలు రాత్రి వేళల్లో ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉందంటున్నారు. అందుకే పిల్లల కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ పురుగులు ఎక్కువగా పొట్ట, బుగ్గలు, ఛాతి, పాదాలప కుడుతాయి అంటున్నారు.స్క్రబ్ టైఫస్ విషయంలో భయం అవసరం లేదని.. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు డాక్టర్లు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వచ్చి తగ్గకపోతే డెంగీ, టైఫాయిడ్, మలేరియాగా భావించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు డాక్టర్లు. ఒకవేళ మచ్చలు కనిపిస్తే వెంటనే స్క్రబ్ టైఫస్ నిర్ధారించేందుకు రక్త పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని.. ప్రజలకు ఆందోళన అవసరం లేదని.. కానీ ముందస్తు జాగ్రత్తలు కూడా అవసరం అంటున్నారు.

## పుల్లూరు పాపమ్మ భౌతికకాయానికి నివాళులర్పించిన తెలుగుదేశం నాయకులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం ఇనాం కొత్తూరు పంచాయతీ జి. టి. కండ్రిగ గ్రామం నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుల్లూరు సుధాకర్ రెడ్డి, తల్లి పుల్లూరు పాపమ్మ నిన్న సాయంత్రం స్వర్గస్తులైనారు. ఆమె భౌతికకాయానికి నివాళులర్పించిన నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్, వాణిజ్య విభాగ అధ్యక్షులు చాణిక్య ప్రతాప్, యూనిట్ ఇంచార్జ్ మోహన్ యాదవ్, ఇనాంకొత్తూరు సర్పంచ్ మోహన్ రెడ్డి, బూత్ కన్వీనర్లు భాస్కర్‌రెడ్డి, కావలి మురళీమోహన్, మల్లికార్జున యాదవ్, గ్రామ కమిటీ కార్యదర్శులు తాతిరెడ్డి జైచంద్రారెడ్డి, గురునాథం యాదవ్, భాస్కర్, వెంకటేష్, సీనియర్ నాయకులు చెంగల్రాయలు, యువ నాయకులు గురుస్వామి రెడ్డి, వెంకటాద్రి, మురళి, నవీన్, బాబు. తదితరులు పాల్గొన్నారు.

## సిజెఐ పై దాడిని ఖండించిన ప్రజా సంఘాల నాయకులు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
అన్నమయ్యజిల్లా పీలేరు భారతదేశ అత్యున్నత న్యాయస్థానంలో జరిగిన సంఘటన, భారత న్యాయ వ్యవస్థలో చీకటి రోజు ఈ దాడి భారత రాజ్యాంగ ఆత్మపైనే దాడి, అని ప్రజాసంఘాల నాయకులు పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కళ్ళకు గంతలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రజా సంఘాల నాయకులు పఠాన్ మౌలా, తుమ్మల ధరణి కుమార్ తపాయి వెంకటేష్,పాలకుంట శ్రీనివాసులు,నగిరిమడుగు సుభాష్, నడిమికండ్రిగ సుధాకర్‌బాబు, కామిని నరసింహులు, గండికోట వెంకటేష్, జెట్టి మల్లికార్జున, కె గటప్ప, దుబ్బా శ్రీకాంత్, కిల్లా విజయ్ కుమార్, వేలూరు గురునాథం, గుండ్లూరు రవీంద్ర,చరణ్, రెడ్డి కుమార్, అన్నవరం, వెంకటరమణ, రాము, హరీష్, ముష్టూరి విశ్వనాథం, వేలూరు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం
### సర్పంచ్ హబీబ్ భాషా



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
అన్నమయ్యజిల్లా పీలేరు మేజర్ పంచా యతీని అభివృద్ధి, పథంలో తీసుకెళ్దామ ని సర్పంచ్ హబీబ్ భాషా తెలిపారు. పంచాయతీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మానందరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీలో సమస్యలను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనాథరెడ్డి,ఉదయ్, నాగభూషణం, మల్లికార్జున రెడ్డి, సాంబశివారెడ్డి, కాలేశా సచిన్ విక్టరీ, వెంకటరమణారెడ్డి, రమణ, అబిద్, పరమేశ, షాజహాన్, పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే భగవద్గీతను అభ్యసించాలి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి భగవద్గీత మకరందాన్ని విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు అభ్యసించాలని శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ప్రజాభూమి ఆర్సి ఇన్చార్జి శ్రీకాళహస్తి నియోజకవర్గం పెరిమిడి రఘు కుమారుడు సాయి తేజకి భగవద్గీత మకరందాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లెంభాకం మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భగవద్గీతను అధ్యయనం చేయటం వల్ల విద్యార్థులకు ఉత్తమ క్రమశిక్షణతో పాటు నేటి సమాజంలో ఉన్న జీవనశైలి విధానంపై సరేన అవగాహన ఉంటుందని.చిన్ననాటి నుంచే భగవద్గీతను అధ్యాయం చేయటం వల్ల ప్రతి సమస్యకు భగవద్గీత సరైన మార్గం చూపుతుందన్నారు. విద్యార్థులకు తెలుగులో చదివే విధంగా భగవద్గీతను హైందవ వారి సౌజన్యంతో బొమ్మలతో కూడిన భగవద్గీతను త్వరలో అందుబాటులో తెస్తామని తెలిపారు.అనంతరం సాయి తేజ మాట్లాడుతూ నాకు చిన్ననాటి నుంచే గ్రంధాలు చదవడం ఆసక్తి ఎక్కువ అన్నారు. భగవద్గీత చదవాలన్న కోరికను తమ ద్వారా భగవద్గీతను అందుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో పెరిమిడి రఘు.పెరిమిడి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143
Associate Editor: Tirumalasetty Koteswara Rao Volume: 1 Issue: 1

## రేణిగుంట డప్పు కళాకారుల మహాసభ ఘనంగా!
### గుర్తింపు కార్డులు - 7 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలి
### రేణిగుంట ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించిన డప్పు కళాకారుల సంఘం





**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
రేణిగుంట మండలంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన డప్పు కళాకారుల మండల మహాసభ ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య హాజరయ్యారు. కళాకారులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన మాట్లాడుతూ – డప్పు కళాకారు లకు గుర్తింపు కార్డులు, రెండు ఎకరాల భూసమాధానం, అలాగే బస్సు, రైలు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం 4000 రూపాయలుగా ఉన్న పెన్షన్‌ను 7,000 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, డప్పు కళాకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, సహజ మరణానికి 5 లక్షల పరిహారం,ప్రతి కళాకారునికి ఇల్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ,"దళిత డప్పు కళాకారులు,బ్యాండ్ సెట్,తీన్మార్ కళాకారులందరూ ఐక్యంగా పోరాడితే మనహక్కులు సాధించగలుగుతాము" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండలం నలుమూలల నుండి వచ్చిన డప్పు కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సభ ముగిసిన అనంతరం పాల్గొన్న కళాకారులు "జై భీమ్" నినాదాలతో మహాసభను విజయవంతం చేశారు.

## సీజేఐ పై దాడిని ఖండించిన వీకోట దళిత సంఘాలు.




**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
భారతదేశ అత్యున్నత న్యాయస్థానంలో నిన్నటి రోజు జరిగిన సంఘటన యావత్ భారత న్యాయ వ్యవస్థలో చీకటి రోజుగా నిలిచిపోతుందని, ఈ దాడి అత్యున్నత గౌరవప్రదమైన భారత రాజ్యాంగ ఆత్మపైనే జరిగిందని వికోటలోని ఎస్సీఎస్టీ బీసీ ముస్లింమైనార్టీ ప్రజలు ముక్తకంఠంతో తెలిపినారు. ఈ సందర్భంగా ప్రజలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ నందు నినాదాలు చేస్తూ సీజేఐ పైన దాడి చేసిన కిషోర్ గౌడ్ పై భారత రాజ్యాంగం అత్యున్నత న్యాయస్థానం న్యాయవాదులు వెంటనే చర్యలు తీసుకొని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా శిక్ష విధించి... శిక్షించాలని వీకోట మండల ఐక్యవేదిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు కోరారు.

## శ్రీదక్షిణకాశీశ్వరస్వామి ఆలయ మండల పూజ



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
పులిచెర్ల మండలం కల్లూరు ఇస్ఆర్ పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో వెలసిన శ్రీదక్షిణ కాశీశ్వరస్వామి సమేత సుబ్రమణ్య స్వామి మండల పూజ నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ హెచ్ఎం రాజశేఖర్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పూజ 9వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల మధ్య శ్రీ దక్షిణ కాశీశ్వర స్వామి సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయ ఆవరణంలో కలసస్థాపన, రుద్రాభిషేకం, రుద్ర హొమం, మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కావున గ్రామ ప్రజలు భక్తులందరూ విచ్చేసి స్వామివారి కృప కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

## సూపర్ జి. ఎస్. టి -సూపర్ సేవింగ్స్‌తో
## నగదును పొదుపు చేసుకోవచ్చు



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
జిఎస్‌టి తగ్గింపుతో ధరల భారం తగ్గడంతో సూపర్‌గా నగదును పొదుపు చేసుకోవచ్చని జి.ఎస్ .టి నోడల్ అధికారి సాబ్జాన్, ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్ జిఎస్ టి. సూపర్ సేవింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు తోసామాన్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, కార్యదర్శులు నాగరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి కేంద్ర ప్రభుత్వం వస్తు, సేవల పన్నును రెండు రకాలకు తగ్గించడంతో అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వెల్లి విరుస్తున్నట్లు జీఎస్టీ అధికారి ముక్కంటి శ్రీనివాసులు అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం పై పట్టణంలోని ఆర్‌పిబిఎస్ జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గతంలో జీఎస్టీ ఐదు రకాలుగా ఉండేది అన్నారు. ప్రస్తుతం ఆపన్నులను రెండు రకాలుగా కుదించడంతో అన్ని వర్గాలకు ఆదా అవుతున్నట్లుగా పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పన్నులు తగ్గించడం శుభ సూచికమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, ఎంపీడీవో పెంచల శ్యామ్, ఎంఈఓ బాలయ్య, రవి చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పురిటి బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటిది



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
పురిటి బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటిదని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి అన్నారు. పులిచెర్ల మండలం మంగళంపేట అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారం ఆరోగ్య జాగ్రత్తలు తదితరులు వాటి గురించి వివరించారు. అనంతరం పోషక పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజ, శివశంకర్ రెడ్డి, సర్వేయర్ సలీం, మహిళా సంరక్షణ కార్యకర్త అన్నపూర్ణ,అంగన్‌వాడి కార్యకర్తలు జబీనా, స్వాతి, సురేఖ, సోమజ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఉపయోగం అనేకం



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ జీఎస్టీ తగ్గింపు ప్రజలకుఅనేక విధాలుగా ఉప యోగపడుతుందని హెచ్ఎం లోకనాథ రెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీతగ్గింపు తో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్ బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డెహ్రాడూన్‌లో పులి శ్రీకాంత్‌కు ఘన సన్మానం



**(శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,)**
మాజీ సైనికులు పులి శ్రీకాంత్, కుటుంబ సభ్యులను డెహ్రాడూన్ ఆర్మీ యూనిట్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. డెహ్రాడూన్ ఆర్మీ యూనిట్ డైమండ్ సెలబ్రేషన్‌లో భాగంగా దేశ రక్షణ కొరకు తమ సేవలను అందించి... ఉద్యోగ విరమణ పొందిన సైనికులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఇందులో భాగంగా పులి శ్రీకాంత్ కుటుంబ సభ్యులను కూడా సన్మానించారు. మాజీ సైనికులు దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ చరిత్ర పుటల్లో నిలిచిపోతాయని ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా వారి కుటుంబాలను డెహ్రాడూన్ దగ్గరగా ఉన్న హరిద్వార్, రిషికేష్, పుణ్యక్షేత్రాలను దర్శించడానికి ఆర్మీ యూనిట్ ఏర్పాటు చేసి వాళ్లకి సకల గౌరవం కల్పించింది. ఈ సందర్భంగా పులి శ్రీకాంత్ మాట్లాడుతూ... మాజీ సైనికులను పిలిపించి వారి సేవలను గుర్తిస్తూ ఇచ్చిన గౌరవాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. దేశ సేవకు తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులను, గురువులను ఆయన గుర్తు చేసుకున్నారు. భారత దేశ సైనికుడుగా సేవ చేయడం ఎన్నో జన్మల పుణ్యఫలం అన్నారు. మాజీ సైనికులు దేశ అభివృద్ధిలో ఎప్పుడూ ముందంజలో ఉంటారన్నారు. మాజీ సైనికులను గౌరవించిన యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ అలావత్, లెఫ్టినెంట్ కల్నల్ అజయ్ కుమార్, సుబేదార్ మేజర్ అనిల్, గ్లోరియస్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143